పనిచేయని ఫౌంటైన్‌లు!

- ఆహ్లాదానికి దూరంగా గ్రేడ్‌–2 మున్సిపాలిటీ
- అధికారులు, పాలకులకు పట్టని వైనం



మున్సిపల్‌ కార్యాలయం ఎదుట పనిచేయని ఫౌంటైన్‌



దిష్టిబొమ్మలా మిగిలిన జీడిపిక్క బొమ్మ జంక్షన్‌ ఫౌంటైన్‌

కాశీబుగ్గ: గ్రామీణ ప్రాంతాలతో పోలిస్తే పట్టణాల పరిధిలో ప్రజలపై పన్నుల భారం ఎక్కువగా ఉన్నా.. కొన్ని సౌకర్యాలు మాత్రం సమకూరుతాయి. రోడ్లు, పార్కులు, జిమ్‌లు, ఫౌంటైన్‌లు ఇలా చెప్పుకుంటూ పోతే అనేక రకాలుగా ఉండటం మనం చూసే ఉంటాం. వీటిని సమకూర్చడంలో అధికారులు, పాలకమండలి సభ్యులకు చిత్తశుద్ధి ఉండాలి. అయితే గ్రేడ్‌–2గా ఉన్న పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీలో ఈ పరిస్థితి లేదు. ఇక్కడ పార్కులతో పాటు ఫౌంటైన్లు సైతం పనిచేయక ప్రజలు ఆహ్లాదానికి దూరంగా ఉంటున్నారు. ప్రధానంగా పలు కూడళ్లలో ఏర్పాటు చేసిన ఫౌంటైన్‌లు పనిచేయక దిష్టిబొమ్మల్లా దర్శనం ఇస్తున్నాయి. మున్సిపాలిటీలోని 31 వార్డుల పరిధిలో ఉన్న సుమారు 75 వేల మంది ప్రజలకు ఆహ్లాదాన్ని పంచే వాటిలో ఫౌంటైన్‌లు ముఖ్యమైనవి. రోజూ సాయంత్రం నుంచి రాత్రి వరకు రంగురంగుల విద్యుత్‌ వెలుగుల్లో నీటి ధారలతో ఆనందాన్ని పంచే ఫౌంటైన్‌లు మూలకు చేరాయి.

- వైఎస్‌ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు రూ. రెండు కోట్లతో మున్సిపల్‌ కార్యాలయాన్ని నిర్మించారు. అదే సమయంలో కార్యాలయం ఎదురుగా నాలుగు సింహాలతో కూడిన విగ్రహాలు పెట్టి అతి పెద్ద ఫౌంటైన్‌ ఏర్పాటు చేశారు. అయితే అది ప్రస్తుతం పనిచేయడం లేదు.
- అలాగే ప్రపంచ ప్రఖ్యాతగాంచిన ఉద్దాన జీడిపప్పుకు, పలాస పరిసర ప్రాంతాలలో ఉన్నటువంటి 400 జీడి పరిశ్రమలకు గుర్తుగా మున్సిపాలిటీలో నిర్మించిన జీడిపిక్క బొమ్మ ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన ఆహుతులను ఆకట్టుకుంటుంది. అటువంటి జీడిపిక్క బొమ్మవద్ద ఉన్న ఫౌంటైన్‌ సైతం మూలకు చేరింది.
- కాశీబుగ్గ బస్టాండ్‌ వద్ద రాజీవ్‌గాంధీ విగ్రహం వద్ద ఉన్న ఫౌంటైన్‌ సైతం నిర్వహణ లేక మూలకు చేరింది. రోజు వేలాది మంది ప్రయాణికులు రాకపోకలు జరిపే బస్టాండ్‌కు ఎదురుగా ఉన్న ఫౌంటైన్‌ పనిచేయకపోవడంతో బ్యానర్‌లు కట్టుకోవడానికి వినియోగిస్తున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఇవన్నీ సక్రమంగా పనిచేసేవి. ఇటీవల కాలంలోనే ఇవి మూలకు చేరాయి. ఇప్పటికైనా మున్సిపల్‌ అధికారులు, పాలకమండలి సభ్యులు వీటిపై దృష్టిసారించి వినియోగంలోకి తెసుకొచ్చి సాయంత్రం వేళలో ప్రజలకు ఆహ్లాదాన్ని పంచాలని పట్టణ వాసులు కోరుతున్నారు.

పట్టించుకునేవారు కరువయ్యారు



పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ అభివృద్ధిని పట్టించుకునేవారు కరువయ్యారు. గత ప్రభుత్వ హయాంలో మున్సిపాలిటీని గ్రేడ్‌–3 నుంచి గ్రేడ్‌–2కు అప్‌గ్రేడ్‌ చేశారు. ఇరుకైన కేటీరోడ్డు విస్తరణ పనులు చేసి విశాలంగా తయారీ చేశారు. అయితే గతంలో పనిచేసిన ఫౌంటైన్‌లు ప్రస్తుతం పనిచేయక మూలకు చేరాయి. వీటిని పట్టించుకునేవారే కరువయ్యారు. తక్షణమే నాయకులు, అధికారులు స్పందించి ఫౌంటైన్లకు మరమ్మతులు చేసి వినియోగంలోకి తీసుకురావాలి.

– బమ్మిడి సంతోష్‌కుమార్‌, కో–ఆప్షన్‌ సభ్యులు, పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ

మరమ్మతులు చేయిస్తాం..



మున్సిపాలిటీలో ఉన్న ఫౌంటైన్‌లు ప్రస్తుతం పని చేయడం లేదు. తక్షణమే వాటిని పరిశీలిస్తాం. పైపులు, విద్యుత్‌ లైన్లకు మరమ్మతులు చేసి వాడుకలోకి తీసుకుని వస్తాం. త్వరలోనే ఈ పనులు చేయిస్తాం.

– నడిపేన రామారావు, కమిషనర్‌, పలాస–కాశీబుగ్గ

క్లుప్తంగా

కేంద్ర సర్వీసులపై విద్యార్థులు దృష్టి సారించాలి



ఒబేరియోకు జ్ఞాపికను అందజేస్తున్న దృశ్యం

టెక్కలి: కేంద్ర, రాష్ట్ర సర్వీసులైన ఐఏఎస్‌, ఐపీఎస్‌, ఐఆర్‌ఎస్‌లపై ఇంజినీరింగ్‌ విద్యార్థులు దృష్టి సారించాలని హైదరాబాద్‌కు చెందిన ఈకామ్‌ ఐఏఎస్‌ అకాడమి ప్రతినిధి మేజర్‌ ఎస్‌పీఎస్‌ ఒబేరియో అన్నారు. ఇండియన్‌ అడ్మినిస్ట్రేషన్‌ సర్వీసులతో పాటు కేంద్ర, రాష్ట్ర సర్వీసులపై సోమవారం టెక్కలి ఆదిత్య ఇంజినీరింగ్‌ కళాశాలలో నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఐఏఎస్‌, ఐపీఎస్‌, ఐఆర్‌ఎస్‌ తదితర సర్వీసుల సాధన కోసం ప్రణాళికపై అవగాహన కల్పించారు. ఈకామ్‌ ఐఏఎస్‌ అకాడమి ప్రతినిధి మేజర్‌ ఎస్‌పీఎస్‌ ఒబేరియోకు యాజమాన్య ప్రతినిధులు జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్‌ వి.వి.నాగేశ్వరరావు, ప్రిన్సిపాల్‌ ఎ.ఎస్‌.శ్రీనివాసరావు, కెరీర్‌ గైడెన్స్‌ సెల్‌ ఇన్‌చార్జి డి.యుగంధర్‌, కోఆర్డినేటర్‌ క్రాంతి కుమార్‌ పాల్గొన్నారు.

చైన్‌స్నాచర్ల నుంచి రక్షణ కల్పించాలని వినతి



ఎస్‌ఐ రవివర్మకు వినతి అందజేస్తున్న దృశ్యం

కవిటి: మహిళలు, ఉపాధ్యాయినిలే లక్ష్యంగా దాడులకు పాల్పడుతున్న చైన్‌స్నాచర్ల నుంచి తమకు రక్షణ కల్పించాలని మండల ఉపాధ్యాయ సంఘాల ఐక్య కార్యాచరణ సమితి ప్రతినిధులు కోరారు. ఈ మేరకు కవిటి ఎస్‌ఐ వి.రవివర్మను సోమవారం కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. కొద్దిరోజుల క్రితం కవిటి, కంచిలి మండలాల నడుమ ఓ ఉపాధ్యాయుడి భార్య ద్విచక్ర వాహనంపై వెళుతున్న సందర్భంలో దాడిచేసి నాలుగు తులాల బంగారం దోచుకువెళ్లారని.. తాజాగా సోమవారం టీచర్‌ బల్లెడ భారతిపై చైన్‌స్నాచర్‌ దాడికి పాల్పడిన విషయాన్ని ఎస్సై దృష్టికి తీసుకెళ్లారు. ఎస్సైని కలిసిన వారిలో యూటీఎఫ్‌, ఏపీటీఎఫ్‌ ప్రతినిధులు మురళీప్రకాష్‌, మొర్రి గోపి తదితరులున్నారు.

వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధం



రాజీవ్‌ రంజన్‌ మిశ్రాకు వినత పత్రం అందిస్తున్న దేవరాజు

ఇచ్ఛాపురం రూరల్‌: కొందరి స్వలాభం కోసం సామాజిక కోణంలో ఉన్న రిజర్వేషన్లు వర్గీకరించడం రాజ్యాంగ విరుద్ధమని ఇచ్ఛాపురం నియోజకవర్గం ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ వ్యతిరేక సమితి అధ్యక్షుడు సల్ల దేవరాజు అన్నారు. సోమవారం శ్రీకాకుళం కలెక్టరేట్‌లో షెడ్యూల్డ్‌ కులాల ఉప వర్గీకరణ కమిటీ చైర్మన్‌ రాజీవ్‌ రంజన్‌ మిశ్రాకు వినతిపత్రం అందజేశారు. ఎస్సీ ఉప కులాల వర్గీకరణ చర్యలు వెంటనే ఆపాలని, వాస్తవ జనాభా లెక్కల ఆధారంగా ఎస్సీ రిజర్వేషన్‌ శాతం పెంచాలని, దళితులకు నైపుణ్యాలతో కూడిన విద్యను అందించాలని కోరుతూ వినత పత్రం అందజేశారు. మాలల పోరాట సమితి ప్రతినిధులు డొప్ప వెంకటరావు, నూతలపాటి బాబూరావు, డిస్క రవి, బుస్కల ఈశ్వరరావు, నారాయణమూర్తి ఉన్నారు.

రైస్‌మిల్లు కార్మికుల సమస్యలను పరిష్కరించాలి



ఆర్డీవో వెంకటేష్‌కు వినతి అందజేస్తున్న నాయకులు

పలాస: మందస రైస్‌మిల్లు కార్మికుల చార్టర్‌ ఆఫ్‌ డిమాండ్లను పరిష్కరించాలని శ్రీచైతన్య రైస్‌ అండ్‌ ఆయిల్‌ మిల్లు వర్కర్స్‌ యూనియన్‌ నాయకులు కోరారు. ఈ మేరకు పలాస ఆర్డీవో వి.వెంకటేష్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. సంఘం నాయకుడు ఎస్‌.గణపతి మాట్లాడుతూ.. మందస పరిధిలోని మిల్లు యాజమాన్యాలు, కార్మికులకు మధ్య ప్రతి రెండేళ్లకు ఒకసారి వేతన ఒప్పందం జరుగుతుందన్నారు. ఈ ఏడాది గడువు ముగిసి ఆరు నెలలైన వేతన ఒప్పందం ప్రక్రియ జరగలేదన్నారు. చట్టపరమైన ఎటువంటి హక్కులు ఈ మిల్లుల్లో జరగడం లేదని చెప్పారు. సమస్యను పరిష్కరించాలని కోరారు. సంఘం నాయకులు బి.వెంకటేశం, పి.కూర్మారావు, బి.మల్లేశ్‌ ఉన్నారు.

20 లీటర్ల సారాతో వ్యక్తి అరెస్టు

కంచిలి: మండలంలోని నువాగడ కాలనీ గ్రామ కూడలి జాతీయ రహదారిపై 20 లీటర్ల నాటుసారాతో జలంధర్‌ గొమాంగో అనే వ్యక్తిని పోలీసులు సోమవారం పట్టుకున్నారు. నిందితుడ్ని అరెస్టు చేసి రిమాండు నిమిత్తం నరసన్నపేట జైలుకు తరలించామని ఎస్సై పి.పారినాయుడు తెలిపారు.

రెవెన్యూ సమస్యలు పరిష్కరించండి

- ఎమ్మెల్సీ రామారావు



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రామారావు

కవిటి: శిలగాం రెవెన్యూలో అపరిష్కృతంగా నిలిచిపోయిన భూ సమస్యల పరిష్కారానికి అధికారులు శాశ్వత చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్సీ నర్తు రామారావు కోరారు. తహసీల్దార్‌ బి.మురళీ మోహనరావు అధ్యక్షతన రెవెన్యూ సదస్సును సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శిలగాం, బెలగాం రెవెన్యూ గ్రామాల్లో 70 నుంచి 80 శాతం మంది రైతుల భూమి రికార్డులు సరిగ్గా లేక తిత్లీ తుఫాన్‌ నష్ట పరిహారాన్ని పొందలేకపోయారన్నారు. రెవెన్యూ రికార్డుల క్రమబద్ధీకరణకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఎంపీపీ కడియాల పద్మ, కడియాల ప్రకాష్‌, కడియాల బాబూరావు, బెందాళం రమేష్‌, భీమారావు రౌళో, బల్లెడ సర్వేశ్వరరావు, పొందల కృష్ణారావు, మణిచంద్రప్రకాష్‌, డీటీ బి.కృష్ణమూర్తి, మండల సర్వేయర్‌ మల్లికార్జునపాణిగ్రాహి ఉన్నారు.

అభివృద్ధికి ప్రణాళికలు వేసుకోవాలి



సోంపేట: మాట్లాడుతున్న డీఎల్‌పీవో గోపిబాల



వజ్రపుకొత్తూరు: మాట్లాడుతున్న ఎంపీడీవో రమేష్‌నాయుడు

సోంపేట: పంచాయతీల అభివృద్ధికి ప్రణాళికలు వేసుకోవాలని డీఎల్‌పీవో ఆర్‌.గోపిబాల అన్నారు. మండల పరిషత్‌ కార్యాలయంలో మండలస్థాయి అధికారులు, సర్పంచ్‌లు, కార్యదర్శులు, ఇంజినీరింగ్‌ అసిస్టెంట్లకు పంచాయతీల అభివృద్ధిపై నాలుగు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ఎంపీడీవో ఈశ్వరమ్మతో కలిసి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఎల్‌పీవో మాట్లాడుతూ.. నిధుల వినియోగం, పారిశుద్ధ్య నిర్వహణ, చెత్తతో సంపద తయారీ కేంద్రాలు, పంచాయతీ అభివృద్ధి ప్రణాళికను వివరించారు. వ్యవసాయాధికారి బి.నర్సింహమూర్తి, ఏపీఎం రమణమ్మ, ఈవోపీఆర్డీ వెంకటేశ్వరులు, సోంపేట ఈవో శాంతికుమారి, సర్పంచ్‌లు పిన్నింటి ఈశ్వరరావు, పాతిన శేషగిరి ఉన్నారు.

వజ్రపుకొత్తూరు: సుస్థిర అభివృద్ధి లక్ష్యాలతో అధికారులు, ప్రజా ప్రతినిధులు ముందుకు సాగాలని ఎంపీడీవో ఎన్‌.రమేష్‌నాయుడు అన్నారు. సోమవారం మండల పరిషత్‌ కార్యాలయంలో నిర్వహించిన శిక్షణ శిబిరంలో ఆయన మాట్లాడారు. ఈవోపీఆర్డీ డి.తిరుమలరావు, ఏపీఎం జి.ప్రసాదరావు, ఐసీడీఎస్‌ సూపర్‌వైజర్‌ లత ఉన్నారు.

ఇచ్ఛాపురం రూరల్‌: పంచాయతీల అభివృద్ధి ప్రజాప్రతినిధులు, అధికారుల భాగస్వామ్యంతోనే సాధ్యమని ఎంపీడీవో కె.రామారావు అన్నారు. గ్రామాభివృద్ధిపై పంచాయతీ కార్యదర్శి బదకల హరి శిక్షణ ఇచ్చారు. ఆర్‌డబ్ల్యూఎస్‌ జేఈ కూన విష్ణుమూర్తి పాల్గొన్నారు.

పలాస: సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను సాధించాలని పలాస ఎంపీడీఓ వసంత్‌కుమార్‌ అన్నారు. మండలాభివృద్ధి కార్యాలయంలో నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈఓపీఆర్‌డీ ఎం.వైకుంఠరావు, ఎంఈవో, ఏపీవో పాల్గొన్నారు.

వైభవంగా ధనుర్మాస దీక్షలు ప్రారంభం



కవిటి:ప్రగడపుట్టుగ కోదండ రామాలయంలో ధనుర్మాస దీక్షలో భక్తులు



ఇచ్ఛాపురం: పూజలందుకున్న స్వేచ్ఛావతి అమ్మవారు

కవిటి: మండలంలోని వివిధ గ్రామాల్లో వెలసిన వైష్ణవ ఆలయాల్లో సోమవారం నుంచి పవిత్ర ధనుర్మాసదీక్షలు వైభవంగా ప్రారంభమయ్యాయి. కవిటి పట్టాభిరామాలయంలో ఆలయ అనువంశిక అర్చకులు కందాళ పద్మనాభయోగానందస్వామి ఆధ్వర్యంలో భోగి రోజు వరకు జరిగే 30 రోజుల దీక్షలో భాగంగా తిరుప్పావై పాశురపఠనం, ప్రవచనాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ముందుగా సంక్రమణం సందర్భంగా నెలగంట వేశారు. పల్లెల్లో ప్రతీ ఇంటముంగిట ధనస్సులతో కూడిన ముగ్గులు పెట్టి ధనుర్మాస దీక్షలను ప్రజలు ప్రారంభించుకున్నారు. పట్టాభిరామాలయంలో కొత్త బియ్యంతో ప్రసాదాన్ని స్వామికి నివేదించారు. అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. లోళ్లపుట్టుగ కల్యాణవేంకటేశ్వర, బెజ్జిపుట్టుగ చక్రధర పెరుమాళ్‌, కొత్తూరు సీతారామాలయం, ప్రగడపుట్టుగ కోదండరామాలయంలో ఉత్సవాలు ఆరంభమయ్యాయి.

ఇచ్ఛాపురం: పట్టణంలోని విష్ణుదేవాలయాల్లో ధనుర్మాస పూజలు ప్రారంభమయ్యాయి. స్థానిక జగన్నాథస్వామి దేవాలయంలో మొదటి పూజలు చేశారు. గ్రామదేవత స్వేచ్ఛావతి అమ్మవారి ఆలయంలో కూడా ధనుర్మాస ప్రారంభ పూజలు జరిగాయి.

ఉద్యమ ధ్రువతార పాణిగ్రాహి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న దృశ్యం

కాశీబుగ్గ: కామ్రేడ్‌ సుబ్బారావు పాణిగ్రాహి విప్లవ, సాంస్కృతిక ఉద్యమ ధ్రువతార అని సీపీఐ ఎంఎల్‌ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి వంకల మాధవరావు కొనియాడారు. సోమవారం మందస మండలం హరిపురంలో మార్పు గ్రంథాలయం వద్ద విప్లవ కవి ప్రజా సంస్కృతిక ఉద్యమ ధ్రువతారలైన సుబ్బారావు పాణిగ్రాహి, పంచాయతీ నిర్మల, గోరకల అంకమ్మ, తెలుకల సరస్వతి, చెల్లూరు ఉమారావు, రమేష్‌ చంద్ర సాహుల 55వ వర్ధంతి సభ కరపత్రాన్ని ఆవిష్కరించారు. మందస మండలం రట్టి గ్రామంలో ఈనెల 22న కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఐఎఫ్‌టీయూ జిల్లా కన్వీనర్‌ జుత్తు వీరాస్వామి, ఏఐకేఎంఎస్‌ జిల్లా అధ్యక్షులు మామిడి భీమారావు, వంకల పాపయ్య, భార్గవి ఉన్నారు.

వెటర్నరీ అధికారి మృతికి సంతాపం



నందిగాం: నర్సిపురం పశు చికిత్సాలయంలో జూనియర్‌ వెటర్నరీ అధికారిగా విధులు నిర్వహిస్తున్న బసవల సింహాచలం (61) ఆదివారం అర్ధరాత్రి సమయంలో మృతి చెందారు. సింహాచలం రాత్రి భోజనం చేసి పడుకున్నాక నిద్రలోనే గుండెపోటు వచ్చి మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు భావిస్తున్నారు. మృతునికి భార్య వనజాక్షి, కుమార్తె రేవతి, మందస కో–ఆపరేటివ్‌ బ్యాంకులో పనిచేస్తున్న కుమారుడు నవీన్‌ ఉన్నారు. విషయం తెలుసుకున్న నందిగాం పశుసంవర్ధక శాఖ ఏడీ రవికృష్ణ, వెంకటాపురం పశువైదుడు పాపారావు తదితరులు సింహాచలం కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం తెలియజేశారు.

పారిశుద్ధ్య కార్మికుడికి సత్కారం



నిరంజన్‌ లిమ్మాయి దంపతులను సత్కరిస్తున్న దృశ్యం

ఇచ్ఛాపురం: మున్సిపాలిటీలో అవుట్‌సోర్సింగ్‌ పద్ధతిలో పారిశుద్ధ్య కార్మికునిగా పని చేసిన నిరంజన్‌ లిమ్మాయి ఉద్యోగ విరమణ చేశారు. దీంతో తోటి కార్మికులంతా కలిసి శానిటర్‌ ఇన్‌స్పెక్టర్‌ ఉపేంద్ర చేతులు మీదుగా నిరంజన్‌ లిమ్మాయి దంపతులను సోమవారం దుశ్శాలువతో సత్కరించి రూ.30 వేలు అందజేశారు. కార్యక్రమంలో పారిశుద్ధ్య కార్మిక సభ్యులు రమేష్‌పట్నాయక్‌, సచివాలయ శానిటరీ ఎమినిటీస్‌ పాల్గొన్నారు.

పాఠశాలలో మోటారు ఏర్పాటు



మోటారును ప్రారంభిస్తున్న దృశ్యం

కంచిలి: ఎస్‌.ఆర్‌.సి.పురం ప్రాథమిక పాఠశాల విద్యార్థుల మంచినీటి సమస్యలు ఎట్టకేలకు తీరాయి. విద్యార్థులు నీటి సమస్యతో బాధపడుతుండేవారు. ఈ విషయం తెలుసుకున్న ప్రముఖ వ్యాపారి కిల్లంశెట్టి మోహనరావు రూ. 20 వేలు ఖర్చుచేసి మోటారు, ప్లంబింగ్‌ పనుల్ని చేపట్టారు. సోమవారం దీన్ని ప్రారంభించారు. హెచ్‌ఎం ముకుందరావు పాల్గొన్నారు.

నేడు కవిటిలో జాతీయ పెన్షనర్ల దినోత్సవం

కవిటి: స్థానిక మండల పింఛన్‌దారుల సంఘం భవనంలో మంగళవారం జాతీయ పెన్షనర్ల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్టు ఆ సంఘం మండల శాఖ అధ్యక్షుడు ప్రియా బాబ్జీరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రిటైర్డ్‌ ఉద్యోగులకు బ్యాంకులు అందిస్తున్న సేవలపై సిబ్బంది అవగాహన కల్పిస్తారన్నారు. సభ్యులంతా హాజరు కావాలని కోరారు.

కాశీబుగ్గ: కాశీబుగ్గ కన్యకాపరమేశ్వరి ఆలయం ప్రాంగణంలో మంగళవారం ఉదయం పది గంటలకు పెన్షనర్ల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్టు పలాస మండలం పెన్షనర్ల సంఘం అధ్యక్షులు తమ్మినాన మాధవరావు, సెక్రటరీ నెమలిపురి అప్పారావు తెలిపారు. పలాస అర్బన్‌, పలాస మండలంలోని రిటైర్డ్‌ ఉద్యోగులు హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు.

నూతన కార్యవర్గం



నందిగాం మండల పంచాయతీ కార్యదర్శుల నూతన కార్యవర్గం సోమవారం ఏర్పాటైంది. అధ్యక్షునిగా కుప్పిలి సంతోష్‌కుమార్‌, ఉపాధ్యక్షులుగా యర్ర జోత్స్నదేవి, రమణబాబు, గౌరవ అధ్యక్షులుగా లక్ష్మణరేఖ, జనరల్‌ సెక్రటరీగా లక్ష్మణరావు, జాయింట్‌ సెక్రటరీగా ఉమాపతి, కోశాధికారిగా గోపీనాథ్‌, కార్యవర్గ సభ్యులుగా స్వరూప్‌, పద్మనాభం, ధర్మారావు, ఫాల్గుణరావు, శ్రీనివాస్‌ నియమితులయ్యారు. కార్యవర్గ జాబితాలను ఎంపీడీవో రాజారావుకు అందజేశారు.

–నందిగాం

కిరణస్పర్శ..



టెక్కలిలోని శ్యామసుందరస్వామి వారిని సోమవారం సూర్య కిరణాలు తాకాయి. ధనుర్మాసం ప్రారంభం రోజునే స్వామి వారికి కిరణ స్పర్శ జరగడం ప్రత్యేకత సంతరించుకుంది. విషయం తెలుసుకున్న భక్తులు భారీగా తరలి వచ్చి ఈ సుందర దృశ్యాన్ని తిలకించి ప్రత్యేక పూజలు చేశారు. ధనుర్మాసంలో ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు అర్చకుడు పద్మనాభ పండా వెల్లడించారు.

–టెక్కలి

ఆరోగ్యమే మహాభాగ్యం..



ప్రతిఒక్కరూ ఆరోగ్యంపై దృష్టిసారించాలని పలాస శౌర్య ఆసుపత్రి ఎండీ, ప్రముఖ గైనకాలజిస్ట్‌ డాక్టర్‌ జయలక్ష్మి అన్నారు. ఆడపిల్లల ఆరోగ్యం, పరిశుభ్రతపై మందస మండలం కుంటికోటలోని కె.నారాయణ హైస్కూల్‌లో అవగాహన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినుల సందేహాలను డాక్టర్‌ జయలక్ష్మి నివృత్తి చేశారు. పాఠశాల కరస్పాండెంట్‌ రోహిణీ శంకర్‌, డైరెక్టర్‌ బుద్ధ సూర్య, అరవింద్‌ నారాయణన్‌ ఉన్నారు.

కాశీబుగ్గ

నూతన కార్యవర్గాలు..

కవిటి: మండల పంచాయతీ కార్యదర్శుల సంఘం నూతన కార్యవర్గం ఎన్నికైంది. అధ్యక్షులుగా ఎస్‌. మన్మథరావు, గౌరవ అధ్యక్షునిగా జి.వీరభద్ర స్వామి, గౌరవ సలహాదారుగా మోహన్‌ రావు, ఉపాధ్యక్షునిగా పి.జ్యోతిలక్ష్మి, ప్రధాన కార్యదర్శిగా రత్నాల చంద్రశేఖర్‌, కోశాధికారిగా ఖాన్‌ అబ్దుల్‌, వర్కింగ్‌ ప్రెసిడెంట్‌గా మామిడి హరికృష్ణ, ఆర్గనైజింగ్‌ సెక్రటరీగా వడ్డీన రూప, ఆఫీస్‌ బ్యారర్లుగా గుణవతి, రవిబాబు, విజయ్‌ కుమార్‌ ఎన్నికయ్యారు.

సోంపేట: సోంపేట మండల పంచాయతీ కార్యదర్శుల నూతన కార్యవర్గాన్ని ఎంపీడీఓ ఈశ్వరమ్మ, ఈవోపీఆర్డీ వెంకటేశ్వరులు అధ్యక్షతన ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా ఎం.శాంతి కుమారి, పి.ప్రవీణ్‌, కార్యదర్శిగా ఎ.వరలక్ష్మి, కోశాధికారిగా బి.శ్రీనివాసరావు, ముఖ్య సలహాదారుగా లక్ష్మణమూర్తి, వర్కింగ్‌ ప్రెసిడెంట్‌గా పి.మధు, ఆర్గనైజింగ్‌ కార్యదర్శిగా బి.స్వప్న, ఆఫీస్‌ బేరర్‌గా నరేష్‌ ఎన్నికయ్యారు.

టెక్కలి: టెక్కలి మండలంలో వివిధ సచివాలయాల్లో పనిచేస్తున్న డిజిటల్‌ అసిస్టెంట్‌లు నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా మెట్ట దశరథ, ఉపాధ్యక్షునిగా కొమ్ము కిశోర్‌, కోశాధికారిగా బగాది జీవన్‌ ఎన్నికయ్యారు.

పింఛన్‌ మంజూరు చేయాలని వినతి



వినతులు స్వీకరిస్తున్న ఆర్డీవో కృష్ణమూర్తి

టెక్కలి: వితంతు పింఛన్లు మంజూరు చేసి ఆదుకోవాలని టెక్కలి మండలం జయకృష్ణాపురం గ్రామానికి చెందిన మరక జయలక్ష్మి, టెక్కలి మేదరవీధికి చెందిన తెల్లి కాంతమ్మ తదితరులు కోరారు. ఈ మేరకు ఆర్డీవో ఎం.కృష్ణమూర్తికి సోమవారం కార్యాలయంలో నిర్వహించిన పీజీఆర్‌ఎస్‌లో భాగంగా వినతిపత్రాన్ని అందజేశారు. అలాగే తనకు పింఛన్‌ అర్హత ఉన్నప్పటికీ గతంలో ఇచ్చిన సదరం సర్టిఫికెట్‌లో తక్కువ శాతం నమోదు చేయడంతో దివ్యాంగ పింఛన్‌ అందుకోలేకపోతున్నానని తనకు కొత్తగా సదరం నమోదుకు అవకాశం కల్పించాలని తలగాం గ్రామానికి చెందిన రోణంకి ధనలక్ష్మి విన్నవించారు. స్థానిక పాత జాతీయ రహదారిలో వెంకటేశ్వర ఆలయానికి ఎదురుగా ఎన్‌టీఆర్‌ కాలనీకి వెళ్లే దారిలో మటన్‌ దుకాణంతో ఇబ్బందులు పడుతున్నామని దీనిపై చర్యలు తీసుకోవాలని బి.హరి ఫిర్యాదు చేశారు.

రోడ్డును ఇంటి స్థలంగా మార్చేశారని ఫిర్యాదు



ఆర్డీవోకు ఫిర్యాదు చేయడానికి వచ్చిన బాధితులు

టెక్కలి: టెక్కలి మేజర్‌ పంచాయతీ పరిధి ఆర్టీసీ డిపో ఎదురుగా బాలాజీనగర్‌–2లో సుమారు 15 కుటుంబాలకు ఆసరాగా ఉన్న రోడ్డును ఇంటి స్థలంగా మార్చేయడంతో తమకు రోడ్డు లేకుండా పోయిందని కాలనీ వాసులు సుభద్రాదేవి, ఉషారాణి, హేమలతతో పాటు మరి కొంత మంది ఆవేదన వ్యక్తం చేశారు. కొన్ని సంవత్సరాల క్రితం వేసిన లేఅవుట్‌లో తామంతా ఇళ్ల స్థలాలు కొనుగోలు చేసుకుని నిర్మాణాలు చేశామన్నారు. అప్పట్లో రోడ్డుకు కేటాయించిన స్థలాన్ని ఇప్పుడు ఇంటి స్థలంగా మార్చేశారని వాపోయారు. దీంతో రాకపోకలకు రోడ్డు లేక అవస్థలు పడుతున్నామని వెల్లడించారు. దీనిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బాధితులు సోమవారం టెక్కలి ఆర్డీఓ ఎం.కృష్ణమూర్తికు ఫిర్యాదు చేశారు.

సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన



శంకుస్థాపన కార్యక్రమంలో నాయకులు

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని మూడు వార్డులలో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులకు ప్రజాప్రతినిధులు, అధికారులు సోమవారం శంకుస్థాపన చేశారు. మున్సిపల్‌ చైర్మన్‌ బల్ల గిరిబాబు, ట్రేడ్‌ కార్పొరేషన్‌ చైర్మన్‌ వజ్జ బాబూరావు, బీసీ సెల్‌ రాష్ట్ర నాయకులు లోడగల కామేశ్వరరావు, మున్సిపల్‌ కమిషనర్‌ రామారావు, కౌన్సిలర్లు బల్ల రేవతి, డిక్కల ఆనందరావు, పప్పల ప్రసాద్‌, నాయకులు బల్ల శ్రీనివాస్‌, గోల్ల చంద్రరావు, సంపతిరావు జయరాం పాల్గొన్నారు.

వినతుల స్వీకరణ

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ పురపాలక సంఘం కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల విభాగంలో పలువురు వినతులు అందజేశారు. పింఛన్లు, ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని, మంచినీటి సమస్య పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్‌ కమిషనర్‌ నడిపేన రామారావుకు వినతులు అందించారు.

